# చీకటి బ్రతుకులు

బెహరా వెంకట సుబ్బారావు



వైశాఖ మాసం. ఆ ముహూర్తానికి ఆ గ్రామంలో ఆరు పెళ్ళిళ్ళున్నాయ్. అయిదు పెళ్ళిళ్ళూ ఒక ఎత్తు; ప్రెసిడెంటు పట్టాభిగారింట్లో పెళ్ళి ఒకెత్తు. మిగతా పెళ్ళిళ్ళకు వచ్చిన వాళ్ళు కూడా ప్రెసిడెంట్టుగారి ఇంట్లో పెళ్ళిని చూడ్డానికే ముచ్చట పడ్డారు.

పట్టాభిగారు పెద్ద వ్యాపారి. రెండు మిల్లులున్నాయ్. ఏభయ్ ఎకరాల భూస్వామి. ఆ పైన సమితి ప్రెసిడెంటు. పట్టాభిగారి రెండో అమ్మాయికి పెళ్ళి. ఆ వీధి పొడవునా పెద్ద పందిరి వేశారు. లైటింగ్ ఏర్పాట్లు చేయడానికి ఇద్దరు మనుషులు మూడు రోజులు ముందుగానే వచ్చారు. ఆ వీధి అంతా పట్టపగలుగా ఉంది. వచ్చే పోయే జనంతో కిటకిట లాడుతోంది.

రాత్రి పదకొండు గంటలకు ముహూర్తం! అయినా సాయంత్రం నుండి ఆ వీధి తిరునాళ్ళుగా ఉంది. పందిర పలు రకాలుగా అలంకరించబడింది. రంగు రంగుల విద్యుద్దీపాలు! వాటి విన్యాసాలు! రంగులరాట్నం! గజేంద్రమోక్షం, రావణ సంహారం వగైరా పటాలు! ఎలక్ట్రీషియన్లను అంతా మెచ్చుకొంటున్నారు.

"అవును మరి! మద్రాసు నుంచి తెప్పించారు!"

"లైటింగ్ అరేంజిమెంటుకే వెయ్యి రూపాయలు!"

"స్వర్గలోకంలా ఉంది!"

వగైరా మెచ్చుకోళ్ళు!

ముహూర్త సమయం దగ్గర పడుతున్న కొద్దీ హడావిడి ఎక్కువ కాసాగింది. ఇసుక వేస్తే రాలనంత జనం!

ఆ తాలూకాలోని అధికార్లూ, అనధికార్లూ అంతా విచ్చేశారు. జిల్లాపరిషత్ ఛైర్మన్‌గారూ, ఎమ్మెల్యేగారూ వస్తున్నారన్న వార్త అందింది. పెద్దలంతా లేచి వారి కెదురు వెళ్ళారు ఆహ్వానించడానికి. వారి వారి కార్లని వీధిలోకి తీసుకొని రావడానికి ఎంతో ప్రయత్నించారు. దారి చేయాలని వ్యర్థప్రయత్నం చేశారు. కార్లని వీధి చివరలోనే ఉంచి పెద్దలంతా పందిట్లోకి వచ్చారు. అంతా వరుసగా వేసి ఉంచిన కుర్చీలపై కూర్చున్నారు... ముహూర్త సమయం ఆసన్నమైంది.

పురోహితుల వేద ఘోష!

పిల్లల అరుపులు!

పెద్దల హెచ్చరికలు!

సినిమా పాటలు!

మిలిటరీ బాండు!

కోలాహలంగా ఉంది. అతిథి సత్కారం ఘనంగా జరుగుతోంది. కూల్ డ్రింక్స్ తెచ్చిన వాన్ ఖాళీ అయింది.

వధూవరులను పందిట్లోకి తీసుకొచ్చి పీటల మీద కూర్చుండబెట్టనున్నారు పురోహితులు.

మిలిటరీ బాండు తన నైపుణ్యాన్ని ప్రదర్శిస్తోంది. పందిరిలో అడుగు పెట్టడానికి అర్హత లేదనుకొన్న అలగా జనం దూరం నుంచే కన్నుల పండుగ చేసుకుంటున్నారు.

హఠాత్తుగా లైట్లారిపోయాయ్!

పందిట్లో చిట్ట చీకటి అలుముకొంది. చేతిలో టార్చిలైట్లున్నవారు లైట్లు వేసి ఉంచారు.

దూరంగా నిలబడి విశ్రాంతిగా సిగరెట్లు కాల్చుకొంటూ కబుర్లు చెప్పుకొంటున్న ఆ ఇద్దరు ఎలక్ట్రీషియన్లూ ఆఖరి దమ్మయినా పీల్చకుండా సిగరెట్లను అవతల పారేశారు. పందిట్లోకి పరుగెత్తారు కంగారుపడుతూ.

"ఎక్కడరా సౌందరరాజన్? పిలు!"

గర్జించారు పట్టాభిగారు.

"వస్తుండా సార్!" వణికిపోతూ చెప్పాడు సౌందరరాజన్.

టార్చి లైటు వెలుగులో తన ఎక్విప్‌మెంటును పరీక్షించాడు.

రెండవ వాడు బయటికి వెళ్ళి మరుక్షణంలో తిరిగి వచ్చి చెప్పాడు:

"సప్లయ్ స్టాపయింది సార్!"

సౌందరరాజన్ మనసు కుదుటబడింది.

లోక త్రొక్కబడిన త్రాచులా లేచారు పట్టాభిగారు. తన ఇంట్లో పెళ్ళి ఉందని లైను స్టాఫ్ అందరికీ చెప్పాట. అయినా సప్లయి స్టాపయింది. చకచకా మేడెక్కి తన గదిలోకి వెళ్ళి ఫోన్ చేశారు.

"ఇక్కడ టవున్‌లోకూడా సప్లయ్ లేదు సార్. బ్రేక్ డవున్‌లా ఉంది."

హడలిపోతూ చెప్పాడు అవతలి వ్యక్తి.

హతాశయులయ్యారు పట్టాభిగారు. మేడ మీదనుంచి వూరంతటినీ పరికించి చూశారు. చిట్ట చీకటిగా ఉంది. చాకరిపేటలో రెండు పెళ్ళిళ్ళూ, యాతపేటలో రెండు పెళ్ళిళ్ళూ అవుతున్నాయ్. అక్కడ పెట్రోమాక్స్ లైట్లు చీకటి చీలుస్తూ వెలుగును వెదజల్లుతున్నాయ్. గబగబా మేడ దిగి స్టాక్ రూమ్‌లో ఉన్న పెట్రోమాక్సు లైట్లను బయటకు తీయమని ఆజ్ఞాపించారు. వారి నోట మాట రావడమే తడవు కొట్టులో ఉన్న లైట్లన్నింటినీ బయటకు తీశాడు మిల్లు డ్రైవరు జగన్నాథం.

వాటిని ఎదురుగా పెట్టుకుని కూర్చుని "ఇది పని చేయవే" అనుకున్నాడు మనసులో.

ఆ లైట్లన్నీ కండెమ్డ్ అని ఇదివరలో ఎన్నో సార్లు పట్టాభిగారితో చెప్పినా అప్పుడు మళ్లా చెప్పడానికి భయం పుట్టు కొచ్చింది జగన్నాథానికి. దీపం బుడ్డి వెలిగించి ముందు పెట్టుకుని ఒక పది నిమిషాలు అటూ ఇటూ తిప్పి పెదవి విరిచి


# బ్రిటానియా పాల బిస్కట్



## పెరిగే పాపాయిలకు రుచివంతమైన తోడు!

రుచికరమైన, పుష్టికరమైన

బ్రిటానియా మిల్క్ బికీస్




లింటాస్-BBC-MB-J-203 TL

పక్కనే ఉన్న మిల్లు కళాసీతో నెమ్మదిగా అన్నాడు:

"ఎలా రా? ఇవి బాగవ్వవని ఇదివరకే అయ్యగారితో చాలా సార్లు చెప్పాను."

కామెంట్ చేయడానికి ధైర్యం చాలక మౌనం వహించాడు కళాసీ.

కాలు గాలిన పిల్లిలా తిరుగుతూన్న పట్టాభిగారు రావడంతో లేచి నుంచున్నాడు జగన్నాథం.

"ఇంకా తయారు కాలేదా? కబుర్లు చెప్పడానికి తప్ప ఎందుకూ పనికి రారు!"

వస్తూనే విసుక్కున్నారు.

"ఇది... సీటిని ఇదివరకే చాలా సార్లు ట్రై చేశాం సార్."

తడబడుతూ చెప్పాడు జగన్నాథం.

"బ్రహ్మం చిటికెలో బాగు చేస్తాడు సార్."

ధైర్యం చేసి అన్నాడు కళాసీ.

"అయితే అర్జంటుగా వెళ్ళి బ్రహ్మాన్ని పిలుచుకురా. ఏరా! ఇంకా నించున్నావ్? వెళ్ళి పిలుచుకురా."

గర్జించారు కళాసీ మీద.

బ్రహ్మం బతుకు తెరువు కోసం చాలా పట్నాలూ, పల్లెలూ తిరిగాడు. అతను చేయని పని లేదు. పట్నంలో సినిమా ఆపరేటరుకు అసిస్టెంటుగా కొన్నాళ్ళు పని చేశాడు. ఆ తరవాత సైకిల్ షాపులో పని చేశాడు. కొన్నాళ్ళు మార్కెట్ జంక్షన్‌లో కప్పు తాళాలూ, బేట్రీ లైట్లూ బాగు చేసేవాడు. ఎందులోనూ నిలదొక్కుకో లేక పోయాడు. జీవనోపాధి కష్టం అయింది. తిరిగి స్వగ్రామం చేరుకున్నాడు. అయిదు సైకిళ్ళకు ఓనరు. అద్దె కిచ్చే వాడు. అవి బొత్తిగా పాతవై పోవడం వల్ల ఎవరూ అద్దెకి తీసుకునే వారు కారు. ఎదురుగా ఉన్న వెంకటస్వామి బాంక్‌లో లోను తీసుకుని పదిహేను కొత్త సైకిళ్ళను కొన్నాక బ్రహ్మం సైకిళ్ళు పూర్తిగా మూల పడ్డాయ్. తనకూ బాంక్‌లో లోను ఇప్పించమని ఎన్నో సార్లు పట్టాభిగార్ని ప్రార్థించాడు. కానీ ఆయన కటాక్షించ లేదు. బ్రహ్మం సైకిళ్ళను బాగు చేయడంలోనూ, ఓవరాయిలింగ్ చేయడంలోనూ దిట్ట. పెట్రోమాక్సు లైట్లనుకూడా అవలీలగా రిపేరు చేస్తాడు. పల్లెటూరు కావడం వల్లా, బేరాలు ఎక్కువగా లేకపోవడం వల్లా, సైకిళ్ళు అద్దెలకు పోకపోవడం వల్లా బ్రహ్మానికి రోజులు గడవడం కష్టంగానే ఉంది.

మూడు వారాల క్రితం బ్రహ్మానికి జబ్బు పట్టుకుంది. డబ్బు లేక అలాగునవే ఈడుస్తూ కాలక్షేపం చేశాడు. రోగం బాగా ముదిరింది. రెండు వారాల నుంచీ భోజనంకూడా చేయడం లేదు. భార్య పోరు పెట్టగా పెట్టగా ఒక సైకిల్ని బేరం పెట్టాడు. వంద రూపాయ లన్నా వస్తాయనుకున్న సైకిలుకి అరవై రూపాయలకి బేరం తెగింది. ఆ ఆసామీ మరునాడు డబ్బు ఇచ్చి సైకిల్ని తీసుకుని వెళతా నన్నాడు. డబ్బు అందగానే పట్నం వెళ్ళి పెద్ద డాక్టరుకి చూపించుకో వాలను కుంటున్నాడు.

"బ్రహ్మానికి నెల రోజులు బట్టి జ్వరం బాబూ. మంచం దిగటం లేదు."

చల్లగా వార్త తెచ్చాడు కళాసీ.

**అనుభవం**

**ఇతరుల అనుభవాలను ఎవరూ తన జీవితంలో ఆచరణలో పెట్టరు. ఎంత అలస్యం అయినా ఎవరి అనుభవం వారినే చక్కదిద్దాలి.**

— హోథోరన్

పెట్రోమాక్సు లైట్లను అద్దె కిచ్చే మస్తాను దగ్గర కెళ్ళిన పంతులుగారు కూడా వట్టి చేతులతో తిరిగి వచ్చారు.

"అన్ని లైట్లూ అద్దె కెళ్ళాయటండీ" అన్నాడు.

రెండు వర్తమానాలూ ఒకేసారి విన్న పట్టాభి గారికి ఒళ్ళు తెలియని కోపం వచ్చింది.

"బ్రహ్మం బడ్డీని తెరిచి మన లైట్లను అర్జంటుగా బాగు చేస్తాడో లేక నన్ను రమ్మంటాడో అడగండి."

పంతులుగారి వైపు తిరిగి హుంకరించారు.

గబగబా అడుగులు వేయబోతూన్న పంతులు గార్ని వెనక్కి పిలిచారు. వెనక్కి వచ్చారు పంతులు గారు.

"బ్రహ్మానికి ఒంట్లో బాగులేదన్న మాట నిజమే. మందులు కొనుక్కోవడానికి పది రూపాయలు అప్పు కావాలని మొన్న వచ్చి అడిగాడు. మూడ్ బాగులేక లేదు పొమ్మన్నా! ఇప్పు డర్జంటుగా మన లైట్లు బాగు చేస్తే రేపు పట్నం తీసుకెళ్ళి నేనే స్వయంగా పెద్ద డాక్టరుకి చూపిస్తానని చెప్పండి!"

"చిత్తం!" అనేసి వెనక్కి తిరిగి ముసిముసిగా నవ్వుకున్నారు పంతులుగారు. పంతులుగారు పట్టాభిగారి ఏకాంతబంటు! వారి కుడి భుజం కూడా. పంతులుగారు బ్రహ్మం ఇంటికి వెళ్ళగానే బ్రహ్మం బడ్డీ దగ్గరికి లైట్లన్నింటినీ తరలించాడు జగన్నాథం.

ఊళ్ళో పెళ్ళివార్ని బతిమాలి రెండు లైట్లని సంపాదించగలిగాడు రెండో మిల్లు డ్రైవరు అప్పారావు.

పంతులుగారు చెప్పినదంతా నిదానంగా విన్నారు బ్రహ్మం దంపతులు.

"నేను లేచి కూర్చునే పరిస్థితిలో లేను పంతులు గారూ!" నీరసంగా విన్నవించుకొన్నాడు బ్రహ్మం మంచం మీద పడుకొనే.

"ఇది నిజమేనయ్యా! బాగుంటే రోగం భయ పడి పారిపోతుంది! డబ్బు లేకనే రోగాన్ని ముదరబెట్టు కొని ఇంతవరకూ తెచ్చుకొన్నావ్! ఒక అరగంట కష్ట పడ్డావంటే రేపీపాటికి పెళ్ళి కొడుకులా లేచి కూర్చుంటావ్! ప్రెసిడెంటుగారే స్వయంగా రేపు పట్నానికి తీసుకెళ్ళి పెద్ద డాక్టరుకి చూపిస్తా నన్నారు! ఈ సదవకాశం పోగొట్టుకోకు! లే! లేచి నెమ్మదిగా ఓపిక తెచ్చుకో!"

చెప్పవలసింది చెప్పారు పంతులుగారు.

"ఇరవై లంఖణాలు చేశారు! లేస్తే తూలి పడిపోతున్నారు! ఆయన్ను వదిలేయండి బాబూ! మీకు పుణ్యం ఉంటుంది!" బ్రతిమాలింది బ్రహ్మం భార్య.

"బ్రహ్మానికి ఏమీ భయం లేదమ్మా! నే దగ్గ రుంటా! ఈ కాస్త ఉపకారం చేస్తే ప్రెసిడెంటు గారు చాలా సంతోషిస్తారు! రేపీపాటికి బ్రహ్మాన్ని మామూలు మనిషిని చేసే పూచీ నాది! మందు లేకుండా రోగం నయం అవుతుందా? లంఖణాలు చేస్తే నీరసం హెచ్చుతుంది గాని, రోగం తగ్గదే!"

"మావి చీకటి బతుకులు బాబూ! మమ్మల్నెవ్వరూ ఆదుకోరు! మా బతుకు లిలా తెల్లారి పోవాల్సిందే! ఇలాగన్నానని తమరు మరోలా అనుకోకండి! ఆయన పరిస్థితి ఏం బాగు లేదు! తమరే చూస్తున్నారు గదా!"

ఒక్క క్షణం మౌనం వహించారు పంతులు గారు. బ్రహ్మం మౌనంగా ఉండడం చూశారు.

"ఇదిగో బ్రహ్మం! ఒక విషయం చెబుతా వింటావా? ఇది ప్రెసిడెంటుగారింట్లో పెళ్ళి! వారి చల్లనీ చూపుల్లోనే మనలాంటివాళ్ళం బతకాలి. పెద్దవారికి ఆగ్రహం వచ్చినా, అనుగ్రహం కలిగినా కష్టమే! ఆలోచించుకో!"

హెచ్చరించాడు ఆఖరి అస్త్రంగా.

బ్రహ్మానికి పంతులుగారి మాటలు అర్థం అయాయ్.

"తమరు చెప్పింది నిజమే బాబూ! కానీ నే నడుగేయలేనే!"

"అదిగో! మళ్ళీ మొదటికొస్తున్నావ్! రిక్షా తెస్తాను! బడ్డీ తాళాలు పట్టుకో!"

బ్రహ్మానికి మరో మాట అనడానికి అవకాశం ఈయకుండా బయటకు వెళ్ళి, మరు నిముషంలో రిక్షా తెచ్చారు.

బ్రహ్మం మాటాడలేక పోయాడు!

అతని భార్య వారించలేకపోయింది! !

బ్రహ్మాన్ని నెమ్మదిగా రిక్షా దించి బడ్డీలో కూర్చుండబెట్టారు పంతులుగారు, జగన్నాథం ఇద్దరూ కలిసి. మిల్లు కళాసి రెండు గ్లాసుల వేడి వేడి కాఫీ తెచ్చి అందించాడు. కాఫీ తాగి వణకుతున్న చేతులతో లైట్లను అందుకున్నాడు బ్రహ్మం.

బ్రహ్మం వెలిగించిన అయిదు లైట్లనూ తీసుకొని పెద్ద మొనగాడిలా పెళ్ళి పందిట్లో అమర్చ పెట్టారు పంతులుగారు. ఆ వెలుగులో పీటల మీద కూర్చున్న పట్టాభిగారి కళ్ళు మిలమిల మెరిసిపోయాయ్.

పెళ్ళయింది.

పల్లకీలో వధూవరులని కూర్చోబెట్టి వూరేగింపు మొదలయింది. ముందు మిలిటరీ బాండు! వెనుక పల్లకి. ఆ వెనుక పెళ్ళివారు! ఆ తర్వాత ఆ గ్రామ ప్రజ. వూరంతా బయలు దేరింది, వేడుకగా. ఆ బ్రహ్మాండమైన వూరేగింపు బ్రహ్మం బడ్డీ ముందు నుంచే వెళ్ళింది. కానీ చూడ్డానికి నోచుకోలేదు బ్రహ్మం! ఆ బడ్డీలో నేలకొరిగి ప్రాణవిముక్తుడైన బ్రహ్మాన్ని ఎవరూ గమనించ లేదు!

*